బానిస

భమిడిపాటి భాస్కరరామారావు

చుక్క గొల్లుమంది. వీరిగాడు మూసిన కన్ను తెరవడంలేదు. వాడు ఆమె కండలో కండ. రక్తంలో రక్తం. వాడి ఒంటిని ఎర్రటి నెత్తురు చారలు. అప్పుడే కొన్ని చారికలు నల్లటి పెచ్చులు కట్టాయి. బాధగా ఒగరుస్తున్నాడు వీరిగాడు. వాడి ఒంటిమీద చేయివేసి చూచింది చుక్క. పెనంలా కాలిపోతోంది వళ్ళు.

గుడిసెలో బుడ్డి దీపం మందంగా వెలుగుతోంది. ఒకమూలగా పొయ్యిమీది ఎవరు మరుగుతోంది. పొయ్యిలో పుల్లలు బయటవే మండుతున్నాయి. పుల్లలు ఎగదొయ్యాలనిగాని, రాగి పిండో, బియ్యపు నూకలో ఎసట్లో పొయ్యాలని కాని తోచడంలేదు చుక్కకి. ఆమె మనసునిండా పదేళ్ళ వీరిగాడే నిండిఉన్నాడు.

వీరిగాడిని తనివితీరా గుండెలకు హత్తుకోవాలని మనసు తీరా కౌగలించుకోవాలని తల్లిమనసు ఉబలాటపడింది. కాని ఆమెకు ఆ అవకాశం యివ్వడంలేదు వీరిగాడు. ముట్టుకునేసరికే బాధతో విల విలలాడిపోతున్నాడు. వాడి శరీరస్థితి అంత దారుణంగా ఉంది.

చుక్క కళ్ళు నీటితో నిండిపోయాయి. నీటిపొర తెగి మలినమైన ఆమె బుగ్గలమీదనుండి జారి వీరిగాడిమీద పడింది ఎర్రటి గాయంమీద ఉప్పటి కన్నీటి బొట్లు. వీరిగాడిలో కదలిక వచ్చింది. తల అటూ యిటూ ఊగించాడు.

చుక్క ముఖంలో చెప్పలేనంత ఆనందం తాండవించింది. దానితో రవ్వంత ఉత్సాహం కలిగింది. ఆ ఉత్సాహం చిన్న కెరటంలా ఆమె చేతుల్లోకి ప్రవహించింది. వీరిగాడి బుగ్గలు నిమరడానికి చేతులు ముందుకు చాపింది.

వీరిగాడు పెదిమలు కదిపాడు "...ద...ద...దా...గం... మంచినీల్లియ్యే." అస్పష్టంగా వినిపించింది చుక్కకి.

చటుక్కున కుండ వద్దకు పరుగెత్తింది చుక్క. మకిలిపట్టి సొట్టలు పడిఉన్న సిల్వర్ గ్లాసుతో నీళ్ళందుకుంది. వీరిగాడి పెదిమలు

బానిస

మునివేళ్లతో విడదీసి కొద్ది కొద్దిగా నీరు ఒంపింది. వీరిగాడు మెల్లమెల్లగా రెండుమూడు గుక్కలు నీరు త్రాగాడు.

"ఏటయిందిరా ? ... ఈరీ ! ... నీకేట యిందిరా ?" దుఃఖం వల్ల గొంతు జీర పోయింది చుక్కికి. మాట స్పష్టంగా రావడం లేదు. పెదిమలు వణుకుతున్నాయి.

నీళ్ళు త్రాగడంతో కాస్త ఊపిరి లేచి వచ్చింది వీరిగాడికి. అతికష్టం మీద కనురెప్ప లెత్తి తల్లివంక చూచాడు.

"ఏటయిందిరా ఈరీ !" మళ్లీ అడిగింది చుక్కి. ఆమె గొంతు ఆందోళనగా ఉంది.

"ఓలమ్మా ! ఆబోతే... పెసరసేను కడ్డం పడ్డాది. తోలబోయానే."

"నువు సేలో కెందుకెల్లావురా ? మీ అయ్యేమయ్యాడు ?"

"సినదొర ఊరెల్తన్నాడే. ఆరి పెట్టె బెడ్డింగు అట్టుకుని అయ్య ఆరి ఎనకెల్లాడే. నన్నేమో పెసరసేను సూత్తా ఉండమన్నాడే." వగరుస్తూ కాసేపు ఆగాడు వీరిగాడు. చుక్కి మరికాసిని మంచినీళ్లు వాడి నోటిలో పోసింది. అవి త్రాగి, "సేనేపికి ఆబోతొచ్చింది—నేను రాయి యిసిరాను అది ఆగలేదు. సేను కడ్డంపడింది కర్రొట్టుకుని ఎనకేపునించి ఒక్కటుచ్చుకున్నానే. అది అడ్డం తిరిగింది. నన్ను కొమ్ముల్తో యిసి రేసిందే"

"ఓరి నా కొడకో..." చుక్కి గొంతు తడబడింది.

కొడుకు చేనుకు కాపలా ఉండడం, ఆబోతు ఎదురు రావడం, కొమ్ములతో వీరిగాడిని విసిరి పారవేయడం ఆమె కంటి ముందు ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఆమె చిగురు టాకులా ఒణికిపోయింది. ప్రేమా, దయా, కరుణా, ఆర్ద్రతా, మాటలకూ చేతలకూ అందని భావనా, తడారిన కళ్ళూ...చుక్కి నిభాయించుకోలేకపోయింది.

ఆబోతు ఎత్తి పారవేస్తున్నప్పుడు వీరిగాడు పెట్టిన కేకలు ప్రక్కపొలాల్లో పని చేసుకుంటున్న రైతులు విన్నారు. బాణా కర్రలతో పరుగు పరుగున వచ్చారు. విసిరి పారేసి తిరిగి బుసలుకొడుతూ వీరిగాడి మీదకు ఉరకబోతున్న ఆబోతును తరిమి కొట్టారు. వీరిగాడిని భుజాల మీద వేసుకున్నారు. తెచ్చి గుడిసెలో దింపారు. చుక్కి వీరిగాడితో ఏదో అనబోతోంది. ఇంతలో దొర యింట్లోంచి రంకెలు వినిపించాయి. దొర అరుస్తున్నాడు.

"ఏడీ? ఎక్కడ ?" అరిచాడు భుజంగరావు. అరుపు పెద్దింట్లో ప్రతి ధ్వనించి వెనుక నున్న పాకలో వినిపించి తాటాకుల్లో తల దాచుకుని ఆకాశంలో కలిసిపోయింది.

పాకలో చుక్కి పెద్దింట్లో పార్వతమ్మా ఒక్కసారే ఉలిక్కిపడ్డారు. పార్వతమ్మ వంటింట్లోంచి వచ్చింది. పమిట కొంగుకు చేతులు తుడుచుకుంటూ కలవరపాటును కప్పి పుచ్చుకుంది.

"ఏమిటండీ ఆ రంకెలు ? ఎవరి మీద?" అడిగింది పార్వతమ్మ.

ఆమె ప్రశ్నకు బదులివ్వకుండానే హాలులోకి నడిచాడు భుజంగరావు. వంకెకు వ్రేలాడదీసిన హంటర్ అందుకున్నాడు. వచ్చినంత వేగంగా యింటి పెరడులో అడుగుపెట్టాడు. నైరుతి మూలగా ఉన్న చుట్టు గుడిసెవైపు తిరిగాడు. "ఒరేయ్ నారిగా ! ఇలా రారా వెధవా !" అంటూ అరిచాడు.

నారిగాడు అప్పుడే గేటులోంచి "దొరా !" అంటూ పరుగెత్తుకుని వచ్చాడు.

నారిగాడు చేతికందే దూరంలోకి వచ్చాడు. వెంటనే భుజంగరావు హంటర్ ఝుళిపించాడు. "వెధవా ! ఒళ్ళు పొకరెక్కిందా ?" హంటర్ గాలిలోకి లేచింది. నారిగాడు ఉండలు చుట్టుకు పోయాడు. నారిగాడు మారు పలకడం లేదు. యజమాని కొట్టే దెబ్బల బాధ పంటిబిగువున అణుచుకుంటున్నాడు. కాని 'ఎందుకు కొడతావు దొరా ?' అని అడగడానికి కూడా ప్రయత్నించడం లేదు. తరతరాల బానిసత్వ ప్రభావం వాడినలా నిర్జీవ ప్రతిమలా మార్చివేసింది.

చీటికి మాటికీ తన భర్త ఏ కారణమూ లేకుండానే నారిగాడిని ఆ విధంగా హింసించడం మామూలే. అయినా భుజంగరావు వెనుకనే వచ్చిన పార్వతమ్మ ఏమీ మాట్లాడలేకపోయింది. అలాంటివేళ అతడిని అడ్డుకునే సాహసం ఆమెకు లేదు. మనసు ఎంత రోదిస్తున్నా నిస్తేజంగా చూస్తూ నిలబడిపోయింది పార్వతమ్మ.

గొడ్డులా వెట్టిచాకిరీ చేస్తున్న తనమగణ్ణి ఆలా దారుణంగా బాదుతున్న దొరవైపు అసహ్యంగా, భయంగా చూస్తోంది చుక్కి. గుడిసెదాటి ముందుకు అడుగువేయలేక అక్కడనే నిలబడిపోయింది.

ఒంటికి పసరువట్లు వేస్తున్న తల్లి ఆఘాటుగా గుడిసె బయటకు వెళ్ళింది. ఛెళ్ళు ఛెళ్ళుమని కొరడా చప్పుడు వినిపిస్తోంది. దొర తన తండ్రిని కొడుతున్నాడని అర్థమైంది వీరిగాడికి. దేక్కుంటూ గుడిసె బయటకు వచ్చి తల్లి వెనుక చతికిలపడిపోయాడు.

"తొత్తుకొడకా ! బంగారంలాంటి పెసర చేను నాశనం చేశావు కదరా ! ఆ నష్టం ఎవరు తీరుస్తాడురా ? నీ అబ్బగాడొచ్చి తీరుస్తాడటరా ?" ప్రశ్న, ప్రశ్న వెనుక హంటర్ దెబ్బ.

నారిగాడు పెదవి విప్పలేదు. మౌనంగా భరిస్తున్నాడు దెబ్బలు.

కొట్టికొట్టి భుజంగరావుకు కూడా అలుపు వస్తోంది. అదే అదనుగా గమనించి, "ఇంక చాల్లెండి !" అంది పార్వతమ్మ.

ఆమె స్వరంలోని భావాన్ని గ్రహించి, ఒక్కసారి ఆమెవైపు ఎర్రగా చూచి, "ఈ వెధవలకు మూడు రోజులపాటు నూకలూ, రాగి పిండి యివ్వకు. కడుపు మాడితేనే గాని బుద్ధి రాదు." అని యింట్లోకి నడిచాడు.

ముద్దలా పడివున్న నారిగాడి వైపు జాలిగా చూచి ఉస్సురని నిట్టూరుస్తూ తనూ లోపలకు నడిచింది పార్వతమ్మ.

నారిగాడిని కొట్టికొట్టి అలసటతో కుర్చీలో కూలబడి ఉన్నాడు భుజంగరావు. వెండి చెంబుతో మంచినీళ్ళందించింది పార్వతమ్మ. గటగటా చెంబు ఖాళీ చేశాడు భుజంగరావు.

"ఎందుకండీ చీటికీ మాటికీ వాడినలా చావబాదుతారు ? వాడే తిరగబడితే ! వాడు తలుచుకోక గాని మీ కబంధహస్తాల బారి నుండి తప్పించుకోలేడా ?" అంది పార్వతమ్మ.

"బానిస వెధవ. తిరగబడితే నిలువులోతున పాతర వెయ్యనూ! ఇక తప్పించుకోవడం సంగతా, అలా జరిగిన నాడు ఏం జరుగుతుందో వాడికి బాగా తెలుసు."

"అవును. బానిస వెధవే ! నిజమే. ఎప్పుడో వాడి తాతల కాలంలో మీ తాతల వద్ద పుచ్చుకున్నది ముష్టి వందరూపాయలు. అందుకే తరతరాలుగా వాళ్ళు మీకు కట్టుబానిసలు."

"వాళ్ళ చావులకు ఖర్చుపెట్టిందో ? వాళ్ళ పుట్టుకలకు మనమే యివ్వడం లేదా ? ఆ వందతోనే సరిపోయిందా ?"

"ఆ డబ్బులెక్కలేమీ నాకు తెలియవు. కాని వాళ్ళ చాకిరీని రూపాయలలో లెక్కిస్తే మనమే వాళ్ళకు రుణపడతామేమో ! ఎప్పుడైనా ఆలోచించారా ? తాము సేవ చెయ్యడానికే

స్కూళ్ళలో కంప్యూటర్లు

పశ్చిమ జర్మనీ స్కూళ్ళల్లో కంప్యూటరు బోధనలకు ఎక్కువ ప్రాముఖ్యత నివ్వాలని పశ్చిమ జర్మనీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 75 శాతం పాఠశాలల్లో కనీసం ఒక కంప్యూటరు ఉన్నది. విద్యార్థుల డేటా ప్రాసెసింగ్ పద్ధతులకు ప్రత్యేకంగా మార్కులను ఇస్తున్నారు. టీచర్లకంటే కంప్యూటర్లే ఎక్కువగా బోధించ గలవనే ఉద్దేశ్యం సర్వత్రా వ్యాపిస్తున్నది. కంప్యూటర్లను ప్రవేశ పెట్టడంవలన టీచర్లకు కూడా బండ చాకిరీ తప్పుతుంది. మరింత నిర్మాణాత్మక కార్యక్రమాలపై వారి దృష్టిని మరలించ డానికి వీలవుతుంది. జపాను, అమెరికా దేశాలలో కిండర్‌గార్టెన్ తరగతులలోకూడా కంప్యూటర్లను ఉపయోగిస్తున్న సంగతిని కూడా ఈ సందర్భంలో పేర్కొన్నారు.

పుట్టామనే న్యూనతాభావం వాళ్ళ మనసుల్లో హత్తుకుపోయింది. ధర్మప్రవచనాలపేరిట వాళ్ళ కదే నూరిపోస్తున్నారు. అందుకే మీలాంటివాళ్ళ ఆటలు యథేచ్ఛగా సాగుతున్నాయి ఈ పుణ్య భూమిలో.

కాని వాళ్ళు నిజం తెలుసుకోగలిగిననాడు ఏమౌతుందో ఊహించగలరా? వాళ్ళ కళ్ళు తెరుపుడుపడ్డనాడు మీ మిథ్యాహంకారం మట్టి గరుస్తుందని తెలుసుకోండి. వాళ్ళ చావు పుట్టుకలకు ఏదో ఉదారంగా ధారపోస్తున్నట్లు మాట్లాడకండి."

"ఏమిటే మితిమీరుతున్నావు. ఆ వెధవలకు రోజూ తిండి పెట్టడంలేదూ?"

"ఆఁ! మహలావు పెట్టేస్తున్నాంలెండి. పండుగ దివాలుతప్ప మిగతా రోజుల్లో వాళ్ళకిచ్చేది నూకలూ, రాగిపిండేకదా?"

"దిగివచ్చావుకదా అన్నపూర్ణమ్మ తల్లివి. వరి అన్నం కుంభాలుగా తోడిపొయ్యి."

"అల్లా పెట్టినా మనమే వాళ్ళకు రుణపడి ఉంటాం."

"కట్టిపెట్టు నీ ధర్మపన్నాలు."

"నా మాట వినండి. కాలం మారుతోంది. దానికనుగుణంగా మనమూ మారడం ప్రకృతికి హితమైన ధర్మం. ఊరుకే మూగజీవాల ఉసురు పోసుకోవడం మనకు శ్రేయస్కరంకాదు. నారిగాడిని వెట్టిచాకిరీనుండి విముక్తుణ్ణి చెయ్యండి."

"మన పనులు?"

"వాడి స్థానంలో వాడినే పాలేరుగా పెట్టుకుందాం. మనకేంగతిలేదు కనుకనా?"

"పాలేరంటే ఏదో పావలాకో పరక్కో దొరుకుతాడనుకుంటున్నట్లుంది నీ వరస చూస్తే. పాతిక బస్తాల ధాన్యమైనా పొయ్యందే దొరకడు. పైగా పాలేరుంటే సరిపోతుందా? పశువులను కాయడానికి మరో కుర్రాడుండాలి. నీకు పాచిపనికీ వంట్లపనికీ మరో ఆడదుండాలి. వీటన్నిటితో ఖర్చుతడిసి మోపెడవుతుంది. ఏమనుకున్నావో."

"మనకు ఏ మాత్రమూ పై ఖర్చు కాకుండా యిన్ని అవసరాలూ కేవలం రాగిపిండీ నూకలతోనే తీరుతున్నాయని చెప్పుకుంటున్నారు గదా—అలాంటప్పుడు ఆ నారిగాణ్ణి అలా చీటికీ మాటికీ ఏ తప్పూ చేయకపోయినా గొడ్డును బాదినట్టి బాదుతారేం?"

"వాడు ఏ తప్పూ చేయలేదని వాదించడానికి వాడి తరఫున వకాల్తా తీసుకున్నావా?"

"అలా వ్యంగ్యంగా మాట్లాడే బదులు అసలు వాడు చేసిన తప్పేమిటో చెప్పరాదూ!"

"వాడికి నేను చెప్పినదేమిటి? వాడు చేసినదేమిటి? రేపో మాపో కోతకు సిద్ధంగా ఉన్న పెసర చేనంతా ధ్వంసం చేశాడు వెధవ."

"మన అబ్బాయిని టవును వెళ్ళే బస్సు ఎక్కించడానికి పెట్టె బెడ్డింగూ తలకెత్తుకుని వెళ్ళాడు. అక్కడికీ పీరిగాణ్ణి కాపలా ఉంచనే ఉంచాడు. వాడేమో వేలెడు వెధవ. వచ్చిందేమో మదించిన ఆబోతు. అక్కడికీ దానిని తోలాలని విశ్వ ప్రయత్నం చేశాడట వెర్రివెధవ. కొమ్ములతో విసిరి పారేసిందట వాణ్ణి. చుట్టుప్రక్కల పనిపాటలు చేసుకుంటున్న వాళ్ళు అడ్డుపడ్డారు. లేకపోతే దారుణంగా చచ్చిపోయి ఉండేవాడు పాపం."

"గొడ్లను కాయడానికిదో దొంగెత్తు, నిజంగా అంత దెబ్బలు తగిలాయేమిటి?" అని, "ఈ మధ్య చుక్కిముండ కూడా సరిగా పని చేస్తున్న జాడ లేదు." అన్నాడు భుజంగరావు.

"అదిప్పుడు ఓపలేని మనిషండీ!"

"మళ్లీ ఓ పనికిమాలిన ఖర్చా?"

"అదేమిటండీ అలా అంటారు. మీ కుటుంబానికి కట్టుబానిసగా పడి ఉండడానికి మరో ప్రాణి భూమిని పడబోతూంటేను." అంది పార్వతమ్మ.

ఆమె తనను ఎద్దేవా చేస్తోందని భుజంగరావుకు తెలుసు. అతడు కార్యవాది. కనుకనే ఏమీ మాట్లాడలేదు. తనకు తృప్తి నివ్వగలది సిరి ఒక్కటే. అది వస్తుంటే చాలు—ఎవరేమనుకున్నా లెక్కచేయడు.

* * *

"ఏమిటే? ఎప్పుడో మీ తాతలనాడు వంద రూపాయల బాకీ పుచ్చుకున్న పాపానికి యిలా పిల్ల పిల్ల తరం వెట్టిచాకిరీ సెయ్యవలసిందేనంటావా?" అడిగింది చుక్కి.

"సెయ్యక మనం సెయ్యగలదేం ఉందే — ఏమీలేదు. నీతో పెళ్లి కావడానికి ముందు నేనూ మా అయ్యతో యిట్టాగే దెబ్బలాడేను. మా అయ్య సెప్పిన మాటలతో మనసు సరిపెట్టుకోలేకపోయాను—ఏటయితే అదే అయిందని తెగించాను ఓనాడు."

"ఏటిసేశావేంటి?" అడిగింది చుక్కి. ప్రక్కనే గోనె గుడ్డల మీద ఒళ్లెరుగని జ్వరంతో మూలుగుతున్నాడు పీరిగాడు.

"ఈ యిల్లిడిసి పారిపోయాను."

"మరి మళ్లీ యిక్కడకే ఎలా సేరావు?"

"నా అంతట నేనే సేరాననుకుంటన్నావేటే? అందుకే నిన్ను ఎర్రిమొగానివనేది. సరుకేదో ఎత్తికెళ్లిపోయానని కేసెట్టాడు దొర. పోలీసోల్లు వెతికి పట్టుకున్నారు."

"మరి నీకాడ సరుకేదీ నేదు కదరా!"

"ఓస్ ఎర్రిమొగమా — మనకాడ నిజంగా ఉండాలేంటే. దొర యిచ్చిన సరుకోటి నా సేతిలో కుక్కారు పోలీసోల్లు. అలా ఎట్టి నన్ను లాక్కొచ్చారు. సుట్టుపక్కలోళ్ళంతా నేను నిజంగానే దొంగతనం సేశాననుకున్నారు. మళ్ళీ అప్పుడు దొరే అడ్డుపడ్డాడు. జేలుకెళ్లకుండా సేపాడు. అదంతా నాటకమని నాకు తెలుసనుకో. మరి మన మాటినేవోడెవడు?"

"ఓర్నీ— నువ్వు నిజంగా దొంగతనం సెయ్యకపోయినా యింత సేసాడంట్రా దొర?"

"ఒక్క దొంగతనమేంటే ఎర్రిమొకమా— ఎవుడో అల్లకి కిట్టనోణ్ణి ఆల్లేసంపేసి అది మన మెడకు సుట్టేగల్రీ దొరలు. అళ్ళసేతికొక్కసారి సిక్కేమంటే మొసలిపట్టే అల్లది."

"అయితే మన యీరిగాడి బతుకు కూడా యిలా తెల్లారి పోవలసిందేనట్రా?" నిస్పృహగా నిట్టూర్చింది చుక్కి.

నారిగాడు ఏమీ మాట్లాడలేదు. అయితే పీరిగాడి జీవుడు బానిసత్వం చెయ్యడానికి ఏ మాత్రం యిష్టపడలేదు. అర్థరాత్రి దాటేసరికి సంధి ప్రేలాపన మొదలయింది. ప్రక్కమీద ఎగిరెగిరి పడసాగాడు పీరిగాడు. నారిగాడు అదరా బాదరా దొరను నిద్రలేవగొట్టాడు. పరిస్థితినంతా వివరించాడు. దొర మనసు కరగలేదు. పార్వతమ్మ బలవంతం చెయ్యగా నారిగాడి గుడిసెదాకా వచ్చాడు దొర. పీరిగాడివైపు తొంగి చూచాడు. దొర వెనుకనే వచ్చిన పార్వతమ్మకు పరిస్థితి పూర్తిగా అర్థమైంది. ఆమె మాతృహృదయం ఆక్రోశించింది. దొర ఒక అడుగు వెనక్కివేసి నారిగాడి నుద్దేశించి అన్నాడు. "ఏమీ ఫరవాలేదు. తెల్లవారాక వీణ్ణి ధర్మాసుపత్రికి తీసుకు వెళ్ళుదువుగానిలే" అన్నాడు.

తన బిడ్డప్రాణం తెల్లవారే దాకా ఆగదని చుక్కి మనసుకు తోచింది. నీళ్ళు నిండిన కళ్ళతో బేలగా పార్వతమ్మ వైపు చూచింది. బండరాయైనా కరుగుతుందేమోగాని కరుడు గట్టిన తన భర్త హృదయం కరుగదని పార్వతమ్మకు తెలుసు. భర్త ఎదుటనే తనకు తానుగా స్వతంత్రించగల శక్తి లేదు. 'అమ్మా! నువ్వో

ప్రేమాభిషేకం

చల్లని జాబిల్లి చక్కదనమును చూసి
తారకా భామినులు దరహాస మొనరింప
పండు వెన్నెలకాంతి కడలి తరగల మెరిసె
జ్యోత్స్నాలతటెల్లతలు వినువీధిలో మురిసె!
గుబురుగా పెరిగిన మహా వృక్షాలు
ఆనందం పంచుకుని తలలూచాయి;
ఎదుగుతున్న లేత మొక్కలు
ఆమూలాగ్రం ఆనందలాస్యం చేశాయి!
ఎదురుచూసి, యెదురుచూసి
కామనల బరువు కన్నుల నిలువగా
అపర్ణ తపస్సమాధిలా
అలివేణి నిద్రించింది!
ఎదురుచూసినవాడు అప్పుడే వచ్చాడు;
నిదురించు ప్రియురాలి నిదుర కలచగలేక
తన్మయానంద కదుష్ణాశ్రువులతోడ
కావించె కోమలికి ప్రేమాభిషేకం!

— లలిత



తల్లి వేగదా !' అని చుక్కికి నిలదీస్తున్నట్టనిపించింది. ఆమె వైపు చూడలేక తల దించుకుంది. భర్త వెనుకనే బయలుదేరింది. వెనుక నిస్సహాయంగా నిలబడిపోయారు నారిగాడు, చుక్కి.

* * *

సాయంకాలం పిట్టలు గూళ్ళకు చేరే వేళ. వేటతుపాకీ భుజాన తగిలించుకుని పొలాల వైపు షికారు బయలుదేరాడు భుజంగరావు. నారిగాడు ఆయన వెనకనే నడువసాగాడు.

వీరిగాడు చనిపోయి ఆనాటికి రెండు రోజులే అయింది. అయినా నారిగాడికి యజమాని వెంట బయలుదేరడం తప్పలేదు. వాడికి అలాటి స్థితిలో కూడా స్వంత చాకిరీని పురమాయించడానికి ఏమీ ఎబ్బెట్టు అనిపించలేదు భుజంగరావుకు. నారిగాడు బానిస. బానిసలు మమత, అనుబంధం మొదలైన ద్వంద్వాలకు అతీతంగా ఉండాలి. అదీ భుజంగం లాంటి వాళ్ళ సిద్ధాంతం.

దిగులుగా అడుగులో అడుగేసుకుంటూ దొరననుసరిస్తున్నాడు నారిగాడు. ఊరు విడిచి పొలాల వైపు వెళ్ళే రోడ్డు మలుపు దాకా వచ్చారు ఆ యిద్దరూ. రోడ్డుమలుపులో ఊడలు దిగిన పెద్ద మర్రి చెట్టు ఉంది. చెట్టుకొమ్మల మీద కొంగలు గూళ్ళలో ఉన్న తమ పిల్లలకు ఆహారం అందిస్తూ సందడిగా ఉన్నాయి.

భుజంగరావు రోడ్డు మధ్య నిలబడి కొంగల వైపు తుపాకీ గురి చూస్తున్నాడు. అతడు వేట తమకంలో ఉన్నాడు. పరిసరాల స్పృహ అతడిలో ఏమాత్రం లేదప్పుడు. కొంచెం దూరంలో నిలబడి తన దొరవైపు తదేకంగా చూస్తున్నాడు నారిగాడు. ఏదో శబ్దం వస్తున్నట్టయి ఈ లోకంలోపడ్డాడు నారిగాడు. రోడ్డు మలుపుకు ఆవలినుండి బస్సువంటి పెద్ద వాహనం వస్తున్నట్టు అర్థంచేసుకున్నాడు చప్పుడునుబట్టి. దొరవైపుకు చూచాడు. అతని ఈ లోకంలో లేడు. అతడికి ఏమీ పట్టలేదు. అతడి దృష్టి కొమ్మలమీది కొంగలవైపే ఉన్నట్టు అర్థమైంది.

ఒక లారి దూసుకుని వస్తున్నట్టు చూచాడు నారిగాడు. "దొరా!" అని ఒక్క అరుపు అరచి దొరవైపు దూకి ఒక్క ఊపున దొరను ప్రక్కకు ఒక్కతోపు తోశాడు. భుజంగరావు రోడ్డు వారగాఉన్న తుప్పలలో పడ్డాడు. నారిగాడి ఆర్తనాదం చెట్టుకు గుద్దుకున్న లారీ చప్పుడులో కలిసిపోయింది. లారీ ముందు చక్రం నారిగాడి నడ్డిమీదుగా పోయింది. రెండు క్షణాల పాటు నారిగాడి కాళ్ళూ చేతులూ తపతపా కొట్టుకున్నాయి. తరువాత నిశ్చలమయి పోయాయి.

దుస్తుకంటిన ధూళీ, ముళ్ళూ దులుపుకుంటూ లేచి నారిగాడివైపు చూచాడు భుజంగరావు. వెంటనే చెట్టుకు గుద్దుకుని ఆగిపోయిన లారీవైపు బయలుదేరాడు. చుట్టుప్రక్కల పొలాలనుండి పరుగెత్తుకుని వచ్చారు రైతులు. లారీని చుట్టుముట్టారు. లారీలోని వ్యక్తులకు పలాయనం చిత్తగించే సావకాశం లేకుండా చేశారు.

* * *

అమ్మగారిచ్చిన పాతకోక కట్టుకుని దొరతో పట్నం వెళ్ళింది చుక్కి. పోలీసుల సమక్షంలో చుక్కిచేత కాగితాలమీద వ్రేలి ముద్రలు వేయించాడు భుజంగరావు. లారీ కంపెనీవారు చుక్కి చేతిలో డబ్బుకట్ట ఉంచబోయారు. దొరవైపు భయం భయంగా చూస్తూ ఆ కట్ట నందుకుంది చుక్కి. వెంటనే ఆ కట్టను తన దొరకే అందించింది చుక్కి. భుజంగరావు కట్టను భద్రం చేశాడు.

"నువ్వు వెళ్ళిరావే చుక్కీ." అన్నాడు భుజంగరావు.

చుక్కి బేలగా నోట్లకట్ట వైపు చూచింది.

భుజంగరావు కసురుకున్నాడు "తినేస్తావా ఏం ? పద యింటికి. నాకు పట్నంలో యింకా పని తగలడిందిలే."

చుక్కి మాట్లాడలేదు. వెనక్కి తిరిగింది. అడ్డదారిన నడక పుచ్చుకుంది. వెళ్ళేటప్పుడు బస్సెక్కించాడు దొర. వచ్చేటప్పుడు నడక. చుక్కి దారి పొడుగునా ఆలోచనలతో సతమతమవుతోంది.

* * *

టాక్సీ యింటి ముందాగింది. ఇంట్లోకి అడుగుపెట్టాడు భుజంగరావు. తిన్నగా ఇనప్పెట్టె ఉన్న గదిలో అడుగుపెట్టాడు. పార్వతమ్మ వెండి చెంబుతో అందించిన నీళ్ళు గటగటా త్రాగాడు.

ఇనప్పెట్టె తెరిచాడు భుజంగరావు. బ్యాగ్ నుండి రూపాయల కట్టతీసి అందులో పెట్టబోతున్నాడు.

"ఎంత దక్కిందేమిటి మృతి నష్టం." అడిగింది పార్వతమ్మ అసహ్యంగా.

నోట్ల కట్ట ఇనప్పెట్టెలో పెట్టి తాళం వేస్తూ, "పదివేలు". అన్నాడు నిర్లిప్తంగా.

"వద్దండీ ! ఆ డబ్బు మనకు వద్దు. ఆ సొమ్ము చుక్కిది. దాని డబ్బు దానికే యివ్వండి. దాని మానాన దానిని వెళ్ళనివ్వండి. కనీసం పుట్టబోయే బిడ్డకయినా బానిస బ్రతుకు తప్పించుకుంటుంది." ఆవేదనగా అంది పార్వతమ్మ.

అప్పటికే ఇనప్పెట్టె తాళం వేయడం ముగించిన భుజంగరావు ఆ గదిదాటి బయట కడుగుపెట్టాడు.

పార్వతమ్మ నిస్ప్రాణగా భర్త వెళ్ళినవైపు చూస్తూ నిలబడిపోయింది. ★

అంకితం

నా చే కలం పట్టించిన మిత్రుడు శ్రీ యస్. వి. వి. సత్యనారాయణకు అంకితం.

— రచయిత